క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

సీతంపేట: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. ఎక్కువగా జ్వర పీడితులు వస్తున్నారని ఆస్పత్రి సూపరింటిండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఓపీ 316 మంది రాగా 68 జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇందులో 33 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గిరిజనులకు మొక్కలు అందిస్తున్న వెలుగు ప్రతినిధులు

భామిని: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఐటీసీ – ఎంఎస్‌కే వెలుగు అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ చంటి అన్నారు. మండలంలోని బొడ్డగూడలో పర్యావరణ పరిరక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. రసాయన ఎరువులకు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. అనంతరం గిరిజనులకు పనస, నేరేడు, ఉసిరి, కాగు, చింత, జామ, ఇప్ప మొక్కలను అందించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే పీసీఓ గోపాలరావు, సీసీ జగ్గయ్య, రామారావు, ఉపాధి ఎఫ్ఏ రమేష్, గిరిజనులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తుండడం అన్యాయం

జియ్యమ్మవలస రూరల్: అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తుండం అన్యాయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు ఓ ప్రకటనలో సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా కొత్త పింఛన్లు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం ఇలా అన్యాయంగా అర్హుల పింఛన్ల తొలగించేందుకు ప్రయత్నిస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడాలని, అలాగే కొత్త పింఛన్లు త్వరితగతిన అందివ్వాలని కోరారు.

విద్యుత్ తీగలపై పడిన చెట్టు



దోకులగూడ రోడ్డులో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట నుంచి డోకులగూడ వెళ్లే దారిలో 11 కేవీ విద్యుత్ లైన్‌పై ఓ నీలగిరి చెట్టు పడింది. దీంతో డోకులగూడ, పుట్టజమ్మువలస తదితర ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది చెట్టు తొలగించి, కరెంట్ సరఫరా పునరుద్ధరించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.ఎల్.రఘుకుమార్ తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో సోమవారం నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య తనిఖీలు తప్పనిసరిగా చేసుకోవాలని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారినపడకుండా ఉండాలన్నారు. ప్రతిరోజూ ఎంతో కొంత వ్యాయామం చేయడంతో పాటు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, 108 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక పాలకొండ – వీరఘట్టం, సీతంపేట రహదారుల్లో సిబ్బందితో కలిసి ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా అధిక లోడు, మితిమీరిన వేగం, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి సంబంధిత యజమానులకు, వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

శక్తి యాప్ వినియోగంపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన శక్తి యాప్ వినియోగంపై స్థానిక తిరుమల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద సమయంలో యాప్‌ను ఆశ్రయిస్తే పోలీసులకు సమాచారం వెళ్తుందని తర్వాత రక్షణ కల్పించబడుతుందని పోలీసులు తెలిపారు.

వర్షం పడడంతో నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్న వీరఘట్టం హైస్కూల్ గ్రౌండ్



నీరుగారిన లక్ష్యం..

- జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం పనులు అస్తవ్యస్తం
- అరకొర పనులతో వదిలేసిన కెమిస్ట్రీ ల్యాబ్
- గాలికొదిలేసిన కిచెన్ గార్డెన్
- పట్టించుకోని అధికారులు

వీరఘట్టం:

కొండ నాలుకకు మందేస్తే...ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉంది మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం పరిస్థితి. పీఎంశ్రీలో భాగంగా రూ.5 లక్షల నిధులతో చేసిన గ్రౌండ్ అభివృద్ధి పనులు మట్టిలో కలిసిపోయాయి. తొలుత ఎంతో దృఢంగా ఉండే మైదానంలో ఉండే మట్టిని తొలగించి కొత్తగా ఆరు నెలల కిందట వేసిన మట్టితో ప్రస్తుతం పడుతున్న వర్షాలకు మైదానంలో నడవలేని పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులు చేయక ముందే మైదానం ఎంతో బాగుండేదని.. ప్రస్తుతం గ్రౌండ్ పూర్తిగా పాడైందని పలువురు చెబుతున్నారు. కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి



కిచెన్ గార్డెన్‌లో పెరుగుతున్న పిచ్చిమొక్కలు

కూడా వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రౌండ్ అభివృద్ధికి ఇంతవరకు రూ.4.25 లక్షలు ఖర్చు చేసినట్లు హెచ్ఎం సొంబర తెలిపారు. అయితే పనులు జరిగేటప్పుడు కనీసం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లునాసిరకంగా పనులు చేపట్టి నిధులు కాజేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అరకొర పనులతో సరి..

పీఎంశ్రీ పథకంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి రూ. 15.58 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇంత వరకు రూ.13.25 లక్షలు ఖర్చు చేసినా పనులు పూర్తికాలేదు. కనీసం విద్యుత్ సదుపాయం గాని, మంచినీటి సదుపాయం గాని కల్పించకుండా అరకొర పనులతో వదిలేశారు. రెండు నెలల కిందట భవనం పనులు పూర్తయినా ఇంత వరకు మిగిలిన సదుపాయాలు కల్పించకపోవడంతో పాఠశాల యాజమాన్యం ఈ భవనాన్ని ఇంకా తమ పరిధిలోకి తీసుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి హైస్కూల్ అభివృద్ధి పనుల్లో జరిగిన అవకతవకలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కిచెన్ గార్డెన్‌లో పిచ్చిమొక్కలు..

మన బడి – మన తోట కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ క్రీడా మైదానం పక్కనే గతేడాది ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఏడాది కిందట స్వయంగా మొక్కలు నాటి ప్రారంభించిన ఈ కిచెన్ గార్డెన్ లక్ష్యాన్ని ఇక్కడ వారు గాలికొదిలేశారు. ఉన్నతాధికారులు వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌పై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

> కెమిస్ట్రీ ల్యాబ్ పనులు అరకొరగా చేపట్టి మాకు కాంట్రాక్టర్ అప్పగించాలని చూశారు. మేము వద్దన్నాం. విద్యుత్, మంచినీటి సదుపాయం కల్పించిన తర్వాత భవనాన్ని అప్పగించాలని సూచించాం. అలాగే గ్రౌండ్ పరిస్థితిని కూడా అధికారులకు తెలియజేశాం.
>
> – బి.సొంబర, హెచ్.ఎం, జిల్లా పరిషత్ హైస్కూల్, వీరఘట్టం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో రాజకీయం..

- అసంతృప్తి వ్యక్తం చేసిన యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యం ఇవ్వవద్దని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ప్రాథమిక, యూపీ పాఠశాలల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తుందని.. ప్రతి మండలంలో ఎంఈఓలు సిఫార్సు చేసిన పేర్లను పరిగణనలోకి తీసుకుని, అందులో జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తుంటారని తెలిపారు. ఈ ఏడాది కూడా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఎంఈఓలు ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లు బుట్టదాఖలయ్యాయని ఆరోపించారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఇచ్చిన పేర్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నట్లు విమర్శించారు. గతేడాది వీరఘట్టం మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లను సిఫార్సు చేస్తే వారి పేర్లకు బదులు వేరే వారికి అవార్డులు వచ్చాయన్నారు. పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సీనియర్లను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, ఎస్.రాజకుమారి, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం

వీరఘట్టం మండల కేంద్రంలోని కూరాకులవీధిలో శ్రీకృష్ణా సేవా సంఘం వారు ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతిని సోమవారం సాయంత్రం పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అఘోరాల డ్యాన్స్, అస్తిపంజరాల సెట్, అష్ట లక్ష్మి ప్రదర్శన, బళ్ల మీద వేషాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. – వీరఘట్టం



నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న 12 అడుగులు మట్టి గణపయ్య



అబ్బుర పరచిన అఘోరాలు

వీరఘట్టంలో భారీ వర్షం

వీరఘట్టం: మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు వరకు ఏకధాటిగా వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లోనీ మురుగునీరు సైతం రోడ్లపైకి రావడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

కొనసాగుతున్న వర్షాలు..

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ప్రభావాలతో కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో నాగావళి నదీతీరం వెంబడి చెరువులు, కాలువలు, ఇతర సాగునీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. దీనికి తోడు లోతట్టు వరిపంట భూముల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలో వీరఘట్టం రహదారిలో, రాజుపేట, తంపటాపల్లి, బుక్కూరు, మంగళాపురం, గోపాలపురం గ్రామాల పరిసరాల్లోని సుమారు రెండు వందల ఎకరాల్లో వర్షపు నీరు చేరే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

ఆకట్టుకున్న దీపారాధన



భామిని మండలంలోని పాత బిల్లుమడలో వినాయక మంటపం వద్ద సోమవారం రాత్రి మహిళా భక్తులు దీపారాధన చేపట్టారు. గణనాథుని ఆకారంలో వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి. - భామిని

హామీలు ప్రకటనలకే పరిమితం..

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ కాంతారావు



తుంబకొండలో ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న నాయకులు

సీతంపేట: సీఎం చంద్రబాబు పాలనలో హామీలు ప్రకటనలకే పరిమితమని వైఎస్సార్ సీపీ పాలకొండ నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు ఆరోపించారు. మండలంలోని తుంబకొండ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా గిరిజనుల ఇళ్ల వద్దే పథకాలు అందించారన్నారు. నేడు రేషన్ కోసం గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ఏమైందని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు ఎరువులు అందించలేకపోయారని మండిపడ్డారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమేశ్వరరావు, కార్యకర్తలు గీదరయ్య, రామ్మోహన్, వెంకటేష్, తిరుపతిరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

కురుపాం: రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో బిత్తరపాడు రైతులకు పంటల్లో కలుపు తీయడంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, అపరాల పంటల్లో పెరిగే పిచ్చిమొక్కలను ఏ విధంగా తొలగించాలన్న విషయాలతో పాటు వాటి నివారణకు ఏ రసాయన మందులు వినియోగించాలన్న దానిని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కురుపాం: మండలంలోని కురుపాం 2, శివ్వన్నపేట పాఠశాల విద్యార్థులకు యస్ సొసైటీ వారు వితరణ చేసిన నోట్‌పుస్తకాలు, స్టడీమెటీరియల్‌ను ఎంఈవో ఎన్.సత్యనారాయణ చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి దాతలు సహకరిస్తూ ముందుకురావడం శుభపరిణామమని, దాతలకు తమ తరఫున ధన్యవాదాలని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ సాహెబ్, ఉపాధ్యాయులు భాస్కరరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు ఖాతాదారులకు వరం

సీతంపేట: బ్యాంక్ బీమా పథకాలు ఖాతాదారులకు వరం వంటివని ఎస్‌వీజీబీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగారావు అన్నారు. గొయిదిలోని బ్రాంచ్‌లో ఖాతాదారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎంఎస్‌బీవై పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు ఆర్.రామకృష్ణ, కె.శివప్రసాద్, జి.చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు పోస్టులు ఇవ్వొద్దు

సీతంపేట: ప్రస్తుత మెగా డీఎస్సీలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ పోస్టులను నాన్ ట్రైబల్స్‌తో భర్తీ చేయవద్దని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఏజెన్సీ గిరిజన నిరుద్యోగ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదో షెడ్యూల్ ఏరియా, పెసా, టీఏసీ, గవర్నర్ అనుమతులు లేకుండా మెగా డీఎస్సీలో గిరిజన సంక్షేమ శాఖ పోస్టులను కలపడానికి వీల్లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, ఎస్.చిరంజీవులు, ఎస్.కోటి, కిషోర్, బి.రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకొండ:

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కాకినాడలో కన్నబాబును కలిసి తమ సంతాపం తెలియజేశారు. విక్రాంత్‌తో పాటు పాలకొండ, వీరఘట్టం, రేగిడి మండలాలకు చెందిన నాయకులు కనపాక సూర్యప్రకాశరావు, వెలమల మన్మథరావు, నల్లి శివప్రసాద్, కోట అజయ్‌కుమార్, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్మోహనరావు, వైశ్యరాజు గోవిందరావు, జల్లు జగదీష్ ఉన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విక్రాంత్, తదితరులు

త్వరితగతిన ఈకేవైసీ

సీతంపేట:

తెల్ల రైస్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ డి.శ్రీకన్య తెలిపారు. సోమవారం స్థానిక రేషన్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డిపోకు అలాట్‌మెంట్ చేసిన బియ్యం పూర్తిస్థాయిలో వచ్చాయా, లేదా అనేది సేల్స్‌మన్ దుర్గారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్, రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజూ సకాలంలో డిపో తెరిచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.



ఈపాస్ మెషీన్ పనితీరును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకన్య

జీవో నంబర్ 3కు..ప్రత్నామ్నాయ జీవో ఎక్కడ?



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం: జీవో నంబర్ 3కు ప్రత్నామ్నాయంగా మరో జీవోను తీసుకువస్తామన్న జీవో ఎక్కడని, వెంటనే ఆ జీవోను తీసుకురావాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు మండంగి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన గిరిజన సంఘాల నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మండల కేంద్రంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. గిరిజన సంఘ కార్యాలయం నుంచి ఎల్విన్‌పేట వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆదివాసీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పించాలని, ఎన్నికలప్పుడు జీవో నంబర్ 3ను పునరుద్ధరించడమో.. లేకుంటే దానికి ప్రత్నామ్నాయంగా మరో జీవోను తీసుకురావడమో చేస్తామని ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

ఏది ఏమైనా గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.అనిల్, కార్యదర్శి ఎ.గంగారావు, గిరిజన సంఘం నాయకులు ఎం.సన్యాసిరావు, బి.అడిత్తో తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

గరుగుబిల్లి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వక్తలు కోరారు. మండలంలోని రావుపల్లి గ్రామంలో దేశపాత్రుని చెరువు గట్టుపై పచ్చదనం–వృక్షారోపణ కార్యక్రమం చేపట్టి, సోమవారం మొక్కలు నాటారు. సామాజిక అడవుల శాతం పెరిగితేనే జీవ వైవిధ్యం కాపాడబడడంతో పాటు గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వంటి సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, కార్డియాలజిస్ట్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కార్డియాలజిస్ట్ సూర్యప్రకాష్

గణపతి లడ్డూ రూ.24,600

కురుపాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని నెయ్యిలవీధిలో గణపతి లడ్డూ ప్రసాదం వేలంపాట సోమవారం నిర్వహించారు. 31 కిలోల లడ్డూను రూ.24,600లకు వేలంపాడి ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు ఆ లడ్డూను దక్కించుకున్నారు. ఈ మేరకు ఉత్సవ నిర్వాహకులు ఆ లడ్డూను క్లబ్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సోమశంకర్, శేషు, వినయ్, సాహు, త్రినాథ్, సంతోష్, అభి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



వేలంపాటలో దక్కించుకున్న లడ్డూతో క్లబ్ సభ్యులు

వినాయక లడ్డూ రూ. 55 వేలు

భామిని: మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలు సోమవారం సందడిగా నిర్వహించారు. అనంతగిరిలో గణపయ్య సన్నిధిలో పెట్టిన 30 కిలోల లడ్డూ ప్రసాదాన్ని అదే గ్రామానికి చెందిన గెల్లంకి మంగబాబు రూ.55 వేలకు వేలంపాటలో సొంతం చేసుకున్నారు. అలాగే నేరడి –బి, తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు చేపట్టారు.

నేడు కురుపాంలో వైఎస్సార్ వర్ధంతి

కురుపాం: మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్(వైఎస్ రాజశేఖరరెడ్డి) వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో రావాడ కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

గరుగుబిల్లి: స్థానిక బస్టాండ్ కూడలిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. ఖడ్గవలస జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు.